www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి

రైల్వేలో వృద్ధులకు రాయితీ పునరుద్ధరించాలి

డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

వృద్ధుల పట్ల ప్రతిఒక్కరూ గౌరవంగా ఉండి వారి సలహాలు తీసుకోవాలని కోరుతూ పాలకొల్లులో వృద్ధులు ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గాంధీ బొమ్మసెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైల్వేలో వృద్ధులకు గతంలో వలే రాయితీ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు వంగా నరసింహారావు, యర్రం శెట్టి వెంకటరత్నం, జిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

'మద్యం' షురూ..!

అమల్లోకి కొత్త మద్యం పాలసీ
ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
9 వరకూ దరఖాస్తు ప్రక్రియ, 11న లాటరీ
ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 దుకాణాలు
గీత కార్మికులకు దుకాణాల కేటాయింపుపై స్పష్టత కరువు
వాటాల కోసం పలువురు ప్రజాప్రతినిధుల హుకుం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొత్త మద్యం పాలసీ అమలకు అడుగులు పడ్డాయి. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దుకాణాల కేటాయింపును జనాభా ప్రాతిపదికన నాలుగు విభాగాలుగా కేటాయించారు. పది వేలలోపు జనాభా, పది నుంచి 50 వేలలోపు, 50 వేల నుంచి ఐదు లక్షలలోపు, ఐదు లక్షల జనాభా ప్రాతిపదికన దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పశ్చిమగోదావరి జిల్లాలో 175 దుకాణాలకు, ఏలూరు జిల్లాలో 144 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. గీత కార్మికులకు ఇస్తామని ప్రకటించిన పది శాతం దుకాణాలపై ఇంకా స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. ఈ నెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సాగనుంది. 11వ తేదీన లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరగనుంది. దీనికోసం ఎక్సైజ్ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజు మంగళవారం దరఖాస్తులు రాలేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రెండో తేదీ అమావాస్య కావడంతో, నాలుగోతేదీ తర్వాతే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తుకూ రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ ఫండ్ కట్టాల్సి ఉంటుంది. లాటరీలో మద్యం దుకాణం దక్కినా, దక్కకపోయినా ఆ సొమ్ము వెనక్కి ఇవ్వరు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్నవారికి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు నిర్ధేశించిన లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందుకు కొంత గడువు ఇస్తారు.

మద్యం దుకాణాల్లో వాటా కోసం నాయకుల హుకుం

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో కొంతమంది ప్రజాప్రతినిధులు వాటాల కోసం పావులు కదుపుతున్నారు. గీతకార్మికులు దక్కించుకునే దుకాణాల్లో 75 శాతం వాటా ఇవ్వాలంటూ డెల్టాలోని ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో గీతకార్మిక సామాజిక తరగతికి చెందిన వారంతా గడిచిన సోమవారం భీమవరంలో సమావేశమై దీనిపై చర్చించినట్లు తెలిసింది. నాయకులు కోరుతున్నట్లుగా చేసే ప్రసక్తిలేదని అంతా గట్టిగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై ముందుముందు ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది. ఇతరులు దక్కించుకున్న మద్యం దుకాణాల్లోనూ వాటాల కోసం కొంతమంది ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణాలకు వేసే దరఖాస్తుల్లో సిండికేట్ విధానానికి తెరలేపేందుకు నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎంతమంది దరఖాస్తు చేయాలి. దుకాణం దక్కించుకున్న వ్యక్తి దక్కని వ్యక్తులకు వాటా ఇవ్వాలా.. కొంతమొత్తంలో సొమ్ము చెల్లించాలా అనే దానిపై తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తుల సమర్పణలో సిండికేట్ విధానం సాగితే మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండిపడే పరిస్థితి ఏర్పడనుంది. మద్యం దుకాణాలకు సంబంధించి ముందుముందు మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే పరిస్థితి కన్పిస్తోంది.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ వైఖరి వీడాలి

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించబోమంటూనే కార్మికుల తొలగింపు దారుణం

ఉక్కు పరిరక్షణ నిరసన దీక్షల్లో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

తణుకులో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించబోమంటూనే వేలాది మంది కార్మికులను తొలగించడం దారుణమని, ఇంకా ప్రజలను మభ్య పెట్టాలని చూడడం అత్యంత దుర్మార్గమని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతలు విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ వైఖరి వీడి విశాఖ ఉక్కుపై స్పష్టమైన ప్రకటించాలని, లేనిపక్షంలో మరో విశాఖ ఉక్కు పోరాటం తప్పదని హెచ్చరించారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు జెఎన్‌వి.గోపాలన్, కోనాల భీమారావు, దండు శ్రీనివాసరాజు మాట్లాడారు. కార్మికులను తొలగించడం, బదిలీ చేయడం చూస్తుంటే చాప కింద నీరులా ప్రయివేటీకరణ ప్రయత్నాలు చేస్తున్నారని అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో బిజెపి ఎంఎల్ఎలు, ఎంపీలుగా గెలిచినవారు కూడా విశాఖ ఉక్కు విషయంలో ప్రత్యేక హోదా విషయంలో నోరు మెదపలేకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనికి శ్రీవారు లడ్డుని అడ్డం పెట్టుకోవడం మరింత సిగ్గుచేటని విమర్శించారు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే ప్రజలు రోడ్డు మీదకు వచ్చి మరోసారి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నిరసన దీక్షలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం, బిఎస్‌పి సీనియర్ నాయకులు మువ్వల ఎస్తేరురాణి మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఈ దీక్షలకు సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షత వహించగా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంకా కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.సీతారాంప్రసాద్, సిఐటియు నాయకులు మండ సూరిబాబు, జి.శిరీష్‌కుమార్, ఇంజేటి శ్రీనివాస్, గోపాలకృష్ణరాజు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నేతలు చెల్లబోయిన రంగారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నల్ల రిబ్బన్లు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో కలపాలని, గనులు కేటాయించాలని, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలని, మోడీ డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బొద్దాని మురళీ, బి.కిషోర్, ఎన్.రాధాకృష్ణ, ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ, పి.దక్షిణామూర్తి, గార రంగారావు, కె.అయ్యప్ప, వల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

శృంగవృక్షంలో పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ నాగరాణి

వికలాంగునికి పింఛను అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పాలకోడేరు

పేద ప్రజలకు, అనారోగ్య పీడితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శృంగవృక్షం ఫ్రాన్సోగన మెమోరియల్ లెప్రసీ రిహాబిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సామాజిక పింఛన్లు, పిడిఎస్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను, రేషన్ బియ్యంను కలెక్టర్ అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో నివశిస్తున్న కుష్ఠురోగ బాధితుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఫ్రాన్సోగన మెమోరియల్ లెప్రసీ రిహాబిలిటేషన్ సెంటర్ సేవలు అద్వియమైనవన్నారు. కుష్ఠు అంటువ్యాధి కాకపోయినా సమాజం దూరంగా ఉంచుతోందని, ఇటువంటి వారిని చేరదీసి ప్రేమతో అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పించడంతోపాటు, వారి ఆలనా పాలనా చూస్తున్న రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు ధన్యులని అన్నారు. ఇటువంటి వ్యాధి పీడితుల పట్ల సమాజం ప్రేమతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్సోగన మెమోరియల్ లెప్రసీ రిహాబిలిటేషన్ సెంటర్ ఫాదర్ గాబ్రియేలు తోట, నిర్వాహకురాలు సిస్టర్ లూర్దు మేరీ, అడ్మినిస్ట్రేషన్ సిస్టర్ బ్రెజిత్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, గ్రామ సర్పంచి జంగం సూరిబాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ భానునాయక్, తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి, డిఆర్‌డిఎ ఎపిఒ టి.మురళీకృష్ణ, సివిల్ సప్లయీస్ డిటి ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన సేవలందించాలి : జెసి

ప్రజాశక్తి - పాలకొల్లు

రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తొమ్మిదో వార్డులో ఎండియు వాహనాన్ని, చౌక ధరల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న స్టాకును పరిశీలించి, ఈ రోజు ఎంతమందికి పంపిణీ చేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రానిక్ కాటా తూకాన్ని పరీక్షించారు. పంపిణీలో అవకతవకలుగాని, ఒక్క ఫిర్యాదు రాకుండా పంపిణీ జరగాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదొచ్చినా తక్షణం చర్యలు తీసుకుంటామని ఆపరేటర్‌ను హెచ్చరించారు. అదే వార్డులో చౌకధరల దుకాణానికి వెళ్లి స్టాక్‌రూమ్‌ను, రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్‌లో ఉన్న స్టాక్ ప్రకారం రూమ్‌లో ఉన్న స్టాక్‌ను లెక్కించి లూజుగా ఉన్న సరుకులు కూడా కాటా వేయించి సరిగా ఉన్నాయని గుర్తించారు. నిత్యావసర సరుకుల పంపిణీ ఎలా ఉంది, క్రమం తప్పకుండా మీకు సరుకులు అందుతున్నాయా అని ప్రజలను అడగగా సక్రమంగా అందుతున్నాయని చెప్పడంతో జెసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించే బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు సలహాలు, సూచనలు ప్రజల నుండి వస్తే వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తూనికల్లో తేడా చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జెసి వెంట తహశీల్దారు వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, టౌన్ ప్లానింగ్ ఆఫీసరు వీరబ్రహ్మం, సివిల్ సప్లయీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిని దెబ్బతీయొద్దని నిరసన

నరసాపురం: తమ ఉపాధి దెబ్బతీయొద్దని, లేకుండా ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. మద్యం దుకాణ ఉద్యోగులు మంగళవారం ఉదయం 11 గంటలు దాటినా షాపులను తెరవకుండా ఎక్సైజ్ స్టేషన్ వద్దకు చేరుకుని చేపట్టారు. అనంతరం సిఐ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

సంక్షేమ బోర్డులో గుర్తింపు కార్డు పొందిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియర్ గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం మంగళవారం స్థానిక పార్వతీదేవి ఆలయ ఆవరణలో నిర్వహించారు. ముందుగా ఇటీవల యూనియన్‌లో చేరిన భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ అందజేసిన గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తరలించుకుపోయిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి బోర్డులో జమచేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గతంలో కార్మికులు పెళ్లికానుక, డెలివరీ పారితోషకం, ప్రమాద బీమా వంటి పథకాల కోసం కార్మికులు దరఖాస్తు చేసుకుని ఏడాది కావస్తున్నా అవి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరవల్లి వెంకన్న, తిరునాథం వెంకటేశ్వరరావు, దున్నే రుద్ర నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, యాతం పెద్దిరాజు, ఆనందం గంగాధరరావు పాల్గొన్నారు.

రోడ్లపై మూగజీవాల సంచారం

చర్యలు తీసుకోవాలని ముత్యాలపల్లి వాసుల నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారులపై సంచరిస్తున్న మూగజీవాలతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సామాజిక సేవాకర్త నాగిడి రాంబాబు అన్నారు. మంగళవారం ముత్యాలపల్లి గ్రామంలో గ్రామస్తులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆవులను రహదారులపై వదలకుండా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుమాని మహాలక్ష్మి రావు, కొల్లాటి ఏడుకొండలు, దొంగ ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నియంత్రణకు కఠిన చర్యలు

పట్టణంలో నిర్దేశించిన ప్రాంతంలోనే పార్కింగ్
దుకాణాల వద్ద చెత్త ఎక్కడబడితే అక్కడ వేస్తే చర్యలు
ఆహార పదార్థాల్లో హానికర రంగులు వినియోగిస్తే చర్యలు
జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

జిల్లా ప్రధాన కేంద్రంగా భీమవరం అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆయన పట్టణంలోని షాపులు, రెస్టారెంట్ల యజమానులతో సమావేశమై ప్లాస్టిక్ క్యారీబ్యాగుల నియంత్రణకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ షాపు యజమానులు పొడి, తడి చెత్త వేర్వేరుగా రెండు డబ్బాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం వచ్చే మున్సిపల్ వాహనానికి మాత్రమే అందించాలన్నారు. అలాకాకుండా రోడ్డు పక్కన, కాలవల్లో వేస్తే పర్యవేక్షణ అనంతరం చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం మీ వద్ద ఉన్న క్యారీ బ్యాగుల స్థానంలో సింగిల్ యూజ్ బ్యాగులను వినియోగించడానికి 15 రోజులు గడువు ఇస్తున్నామని, గడువు అనంతరం క్యారీబాగులు అమ్మిన వారిపైన, కొన్నవారిపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లలో తయారు చేసే పదార్థాల్లో హానికర రంగుల వినియోగం నిషేధమన్నారు. వాహనాలు నిలుపుదల చేయడానికి పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తెలియజేస్తామని, అక్కడ మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా మార్కెటింగ్ అధికారి పి.సునీల్‌కుమార్, జిల్లా ఆహార భద్రతా తనిఖీ అధికారి ఎఎస్ఆర్.రెడ్డి, ట్రాఫిక్ సిఐ, పట్టణంలోని షాపులు, రెస్టారెంట్ల యజమానులు పాల్గొన్నారు.

శృంగవృక్షం రైల్వేగేటు 5 రోజులపాటు మూసివేత

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం-పాలకొల్లు మార్గంలో శృంగవృక్షం వద్ద ఉన్న రైల్వేగేటును ఐదు రోజులపాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరం నుంచి పాలకొల్లు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శృంగవృక్షం రైల్వేగేట్‌ను ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మరమ్మతుల నిమిత్తం మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నరసాపురం ఎక్సైజ్ ఎస్ఐగా జైనులాద్దీన్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎక్సైజ్ ఎస్ఐగా ఎండి.జైనులాద్దీన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నుంచి నరసాపురానికి బదిలీపై వచ్చారు. గతంలో పెద్దాపురం, కాకినాడ, అమలాపురం, కైకలూరు స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు.

అంతర్ జిల్లా మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

ప్రజాశక్తి - గణపవరం

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రవణ్‌కుమార్

అంతర్ జిల్లా మోటారు సైకిళ్ల దొంగను మంగళవారం అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్‌పి శ్రవణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామవాసి చప్పిడి ముసలయ్య (30) తన భార్య స్వగ్రామం వల్లూరులో ఉంటుండగా అదే గ్రామానికి చెందిన శెట్టి చిన్నాతో స్నేహం పెరిగి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. గత నెల 23న అనుమానాస్పదంగా సంచరిస్తున్న చిన్నాను అదుపులోకి తీసుకుని విచారించగా మోటారుసైకిళ్ల దొంగతనాలు చేస్తున్నట్లు వెలుగుచూసింది. చిన్నాను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించగా, నాటి నుంచి ముసలయ్య పరారీలో ఉన్నాడు. ముసలయ్యను మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా ఏలూరు, కృష్ణా, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైందని డిఎస్‌పి తెలిపారు. వీరివద్ద నుంచి 16 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచాక్యంగా వ్యవహరించిన గణపవరం ఎస్ఐ మణికుమార్, పోలీస్ సిబ్బంది శంకర్, బి.హేమసుందర్, పి.కాంతయ్య, డి.రత్నకుమార్, కె.సత్యనారాయణ, జగపతిబాబును జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌ను అభినందించారు. కార్యక్రమంలో నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాల్టీలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించకుండా తమకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాసిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణికి ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట వెంకటరమణ, కౌన్సిలర్లు వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణిని కలిసి జరిగిన విషయం వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ కామాని నాగిని, మాజీ వైస్ ఛైర్మన్ షేక్ బులిమస్తాన్, మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ మార్కండేయులు పాల్గొన్నారు.

ఆర్థికంగా దెబ్బతీయాలనే దోపిడీ..

నిందితుల అరెస్టు
కొద్ది గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం టోల్ ప్లాజా సమీపంలో రాజుగారితోట వద్ద సోమవారం రాత్రి ఓ వ్యాపారిని కొట్టి రూ.2 లక్షలు దోపిడీకి పాల్పడిన కేసు మిస్టరీని పోలీసులు కొద్ది గంటల్లోనే ఛేదించారు. తోటి వ్యాపారిని ఆర్థికంగా దెబ్బతీయాలన్న అక్కసుతోనే ఇదే వ్యాపారం చేస్తున్న మరో వ్యాపారి, మరికొంత మంది కిరాయి వ్యక్తులతో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన రాపాక చంద్రరావు విదేశీ వస్తువులు విక్రయిస్తుంటాడు. దీంతో పాటు విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి కరెన్సీ, వస్తువులు కొనుగోలు చేసి వాటిని వెస్ట్రన్ మనీ సెంటర్లలో అమ్ముతుంటారు. ఇదే ప్రాంతానికి చెందిన మేడిద వెంకటరెడ్డి, మాణిక్యబాబు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటారు. అయితే చంద్రరావు వ్యాపారం అభివృద్ధి చేస్తుండడంతో అతన్ని ఆర్థికంగా దెబ్బతీయాలని ఇద్దరు స్కెచ్ వేశారు. కోనసీమ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ, భయ్యా హేమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటా రాజు, మలికిబాబును పురమాయించి రూ.2 లక్షలు విలువైన విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయంటూ చంద్రరావుకు ఫోన్ చేయించారు. సీతారాంపురం సమీపంలోని రాజుగారితోట టోల్ ప్లాజా వద్దకు వస్తే అందజేస్తామని నమ్మించారు. ఇది నిజమని భావించిన చంద్రరావు సోమవారం డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన కిరాయి వ్యక్తులు అయిదుగురు చంద్రరావుపై దాడి చేశారు. తెచ్చిన నగదు రూ.2 లక్షలు దోచుకుపోయారు. దీంతో చంద్రరావు మొగల్తూరు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. విచారించిన పోలీసులు మంగళవారం ఉదయం నిందితులు పట్టణంలోని ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. వారి నుంచి రూ. 1.7 లక్షల నగదు, రెండు బైక్‌లు, పది కత్తార్ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సిఐలు బి.యాదగిరి, జి.దుర్గా ప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

పించన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - తణుకు

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి తణుకు మండలం కొమరవరం, ఇరగవరం మండలం గోటేరు, అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఉదయం 5.45 నిమిషాలకు తణుకులోని 14వ వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. 98 శాతం మందికిపైగా లబ్ధిదారులకు మొదటి రోజే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఎన్టిఆర్ భరోసా చరిత్రలో నిలవబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త పన్నును ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేశారని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. మంగళవారం భీమవరంలోని 29వ వార్డ్ బిసి కాలనీలో ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ఉద్దేశించి తోట సీతారామలక్ష్మి మాట్లాడారు.

తణుకు : లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ముందుగా కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, జనసేన ఇన్ఛార్జి కటికల పల్లారావు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని 22, 26వ వార్డుల్లో ఎన్టిఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, కోటిపల్లి వెంకటేశ్వరరావు, జక్కం శ్రీమన్నారాయణ, వలవల నాని పాల్గొన్నారు.

ఉండి : సంక్రాంతి నాటికి ఉండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో రక్షిత తాగునీటి సరఫరా చేస్తామని ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు, రాష్ట్ర పరిశ్రమల మౌలిక వసతులు కల్పన శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు తెలిపారు. కోలమూరు, కలిగొట్ల గ్రామాల్లో ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సిఎం చంద్రబాబు నాయుడు సచివాలయ సిబ్బంది ద్వారా ఒకటో తేదీనే పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమ గ్రామానికి రక్షిత తాగునీటి సరఫరా లేదని కోలమూరు గ్రామస్తులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడారు. పరిమెళ్ల ద్వారా వెంకయ్య వయ్యేరు కాలువ నుంచి డిసెంబర్లోగా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి జుత్తిగ నాగరాజు, కలిగొట్ల ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణ రాజు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు.

శ్మశాన వాటికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని దళిత శ్మశానవాటికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజు అధికారులను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ సోమేశ్వరరావును పుష్పరాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయనను పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీల్లో ఎకరం స్థలం కేటాయించి అన్ని హంగులతో శ్మశానవాటికలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేని పేదవారిని గుర్తించి వారికి స్థలాలు ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చిన చోట లింకు రోడ్డు, తాగునీరు, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాలని చర్యలు తీసుకోవాలని పుష్పరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్ కుమార్, కె.ప్రసాదరావు, మండల ప్రధాన కార్యదర్శి సాకా బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రులను కలిస్తే ఆనందం

రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వెంకట శేషసాయి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉరుకులు పరుగుల వయసు దాటుతున్నా చిన్ననాటి మిత్రులను కలిస్తే ఆ ఆనందానికి అవధులు ఉండవని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి అన్నారు. భీమవరంలోని లూథరన్ హైస్కూల్లో 1976 - 77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం మండలంలోని పేరుపాలెం బీచ్లో కోస్టల్ లైన్ రిసార్ట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట శేషసాయి దంపతులను, అగ్నిమాపక శాఖ జిల్లా విశ్రాంత అధికారి నల్లి సురేంద్ర, ఆనంద్ దంపతులను మరో 18 మంది విశ్రాంత ఉద్యోగులను చిన్ననాటి మిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు మరువలేనివన్నారు. చిన్ననాటి మిత్రుల సన్మానాల కన్నా వారి ప్రేమ అభిమానాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో వెంకట కృష్ణారావు, పి.వెంకట కమలాకర్, సన్నమడ ప్రసాదరావు, నూకల సత్యనారాయణ, సిద్దని మాధవ పాల్గొన్నారు.

ఆర్డిఒ దాసి రాజును కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆర్డిఒగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దాసి రాజును సబ్ కలెక్టర్ కార్యాలయంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. దాసి రాజును మురళీకృష్ణ సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.నాగేశ్వరరావు, కె.కుమార్, తులసి పాల్గొన్నారు.

కలెక్టర్ను కలిసిన మురళీకృష్ణ

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై చర్చించారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ఆచంట:చేనేత కార్మికులకు మగ్గం పరికరాల పనిముట్లపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, వారిని ఆదుకోవాలని చేతివృత్తుల ఐక్యవేదిక అధ్యక్షులు అల్లాడి సూర్యభాస్కరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత కార్మికులకు తగ్గించిన పట్టు చీరల గిట్టుబాటు ధరను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగి మగ్గం నేస్తున్న చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. అలాగే కార్మికులకు ముద్ర రుణాలు, ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు నేత బజార్లు ఏర్పాటు చేయాలన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల : చెకుముకి టెస్ట్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెఎల్ఎన్.శాస్త్రి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టెస్ట్ కాళ్ల హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోపల్లె విద్యార్థులు లిఖిత దుర్గ, యశస్విని, భార్గవ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానాన్ని, వెస్ట్ బెర్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకర్, బలరామకృష్ణ, షణ్ముఖ వర్మ ప్రయివేటు పాఠశాల విభాగంలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు చెకుముకి మండల కన్వీనర్ బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్వామి మాస్టారు సౌజన్యంతో ఏర్పాటు చేసిన జ్ఞాపికలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్, ఉపాధ్యాయులు ధర్మరాజు, కిషోర్కుమార్, ప్రసాద్, విజయ్ కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల విజేతగా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలువగా, ప్రయివేట్ పాఠశాల విభాగంలో ఇండియన్ డిజిటల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిలిచినట్లు జెవివి మండల కన్వీనర్ జి.సుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్లో మండలం నుంచి ఈ రెండు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణ ప్రాంత పరిధిలోని విద్యార్థులకు జెవివి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంఎంకెఎన్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మొత్తం 29 పాఠశాలల నుండి 83 నుండి విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి ప్రశ్నాపత్రాన్ని వర్మ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పి.ధర్మరావు మాట్లాడారు. అనంతరం జరిగిన చెకుముకి టెస్ట్లో మున్సిపల్ పాఠశాలల విభాగంలో బివిఆర్ఎం బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ప్రయివేటు పాఠశాలల విభాగంలో మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

3 నుంచి 12వ తేదీ వరకూ దసరా మహోత్సవాలు

వెంకటేశ్వరస్వామి ఆలయ ఇఒ అరుణ్కుమార్

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకూ శ్రీ లక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఇఒ మోకా అరుణ్కుమార్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు పది రోజులపాటు జరుగుతాయన్నారు. అమ్మవారి అలంకరణ దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణ రాజు సూర్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో 3వ తేదీన ఆదిలక్ష్మి అమ్మవారి అలంకరణ, కఠారి రామకృష్ణ, ధనలక్ష్మీ దంపతుల సహకారంతో 4న ధాన్యలక్ష్మీ అమ్మవారి అలంకరణ జరుగుతుందన్నారు. అల్లూరి పద్మరాజు, పద్మ దంపతులు, హరిచంద్ర వెంకటప్రసాద్, రామసీత దంపతుల సహకారంతో 5న ధనలక్ష్మీ అమ్మవారి అలంకరణ, నంబూరి గజపతిరాజు, వాణి దంపతుల ఆర్థిక సహకారంతో 6న సంతాన లక్ష్మి అమ్మవారి అలంకరణ, యతిరాజుల ఆండాళ్ గోష్టి వారి ఆర్థిక సహకారంతో 7న ధైర్యలక్ష్మి అమ్మవారి అలంకరణ జరుగుతుందన్నారు. అనిపెద్ది రామలింగేశ్వరరావు, అనంతసూర్య సర్వలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో 8న గజలక్ష్మి, మద్దాలి తిరుమల శ్రీవెంకటేశ్వర్లు, వెంకట తిరువేంగళమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో 9న విద్యాలక్ష్మి, కుమాండూరి రవీంద్రనాథ్, మధులిక దంపతుల ఆర్థిక సహకారంతో 10న గాయత్రీదేవి అమ్మవారి అలంకరణ జరుగుతుందన్నారు.

కుచ్చర్లపాటి సన్యాసి అప్పలరాజు, వినీత దంపతుల ఆర్థిక సహకారంతో 11న ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి అలంకరణ, అల్లూరి అచ్యుత రామరాజు,సూర్య సుబ్బలక్ష్మి దంపతులు, తోటకూర సత్య శ్రీవెంకట సత్య సుబ్రహ్మణ్య విజయ గోపాల వర్మ, రమ్య దంపతుల సహకారంతో 12న విజయలక్ష్మి అమ్మవారి అలంకరణ జరుగుతుందన్నారు. శ్రీలక్ష్మి అమ్మవారికి తుమ్మపూడి శివప్రసాద్ శర్మచే విశేష అలంకరణలు చేయడం జరుగుతుందన్నారు.

తాడేపల్లిగూడెం : ఈ నెల మూడో తేదీ నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారి విజయదశమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లపర రాము తెలిపారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వబిలిశెట్టి నటరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు రూ.50 లక్షలతో ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహిస్తామని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగవల్లి రమేష్, వెండి రథోత్సవ ఊరేగింపు కమిటీ అధ్యక్షులు, ఆడిటర్ నారాయణ రాంబాబు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్య పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో శానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా 30, 31వ వార్డుల్లో పారిశుధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పరిశీలించారు. పనుల గురించి శానిటరీ ఇన్స్పెక్టర్కు తగు సూచనలు చేశారు. 15వ వార్డులోని కబేళాను తనిఖీ చేసి అక్కడున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అసిస్టెంట్ ఇంజినీర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్తో పాటు శానిటేషన్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ గర్వకారణం

తణుకు:ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లే విద్యార్థులు మిగిలిన వారికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమని తణుకు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి అన్నారు. మంగళవారం తణుకు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు టి.గుణశేఖర్, సిహెచ్ సాహితీ ఆల్ ఇండియా నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గుణశేఖర్ గుంటూరు మెడికల్ కాలేజీలో, సాహితీ జిప్మర్ పాండిచ్చేరి కాలేజీలో సీట్లు సంపాదించారన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ప్రభువరం, మాధవీలత, పద్మావతి, చీలి రాజు విజేతలను అభినందించారు.

దొడ్డిపట్లలో బేటీ బచావో బేటీ పడావో

యలమంచిలి :దొడ్డిపట్ల గ్రామంలో మంగళవారం ఐసిడిఎస్ పాలకొల్లు ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఆడ పిల్లలను చదువులో ప్రోత్సహించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్ని తల్లి, సుమతి, ఎస్తేర్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మశ్రీ, లక్ష్మి, దుర్గ శ్రావణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్సి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్.చిక్కాల హైస్కూల్ వద్ద బేటి బచావో బేటి పడావో, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు చెప్పిన విషయాలను గ్రహించి ఆచరించాలన్నారు. రూరల్ ఎస్ఐ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ క్రమశిక్షణతో మెలగాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.సుధారాణి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది వివిఎస్ఎన్.మూర్తి, జి.శాస్త్రి, గంగా మహేష్ నాయుడు పాల్గొన్నారు.

శశిలో 130 మంది రక్తదానం

తాడేపల్లిగూడెం:రక్తదానం ద్వారా అవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడొచ్చని కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ జాతీయ సేవా పథకంలో భాగంగా ఏలూరు ప్రభుత్వ రక్త బ్యాంక్తో కలిసి జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 130 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. మెడికల్ ఆఫీసర్ జి.రమ్య శృతి రక్తదానంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ బహుమతి స్మైల్ మాట్లాడారు. రక్తదానం శిబిరం విద్యార్థులలో సేవా భావనను పెంపొందించడానికి ఒక మంచి అవకాశమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సల్మాన్ బాషా తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కోఆర్డినేటర్ జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని తహశీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. స్థానిక వైఎన్ కళాశాలలో ఈ - క్లాసురూమ్లో స్వర్ణాంధ్ర ఏ2047 అనే అంశంపై అవగాహన సదస్సు కళాశాల ఐక్యూఎసి, రెవెన్యూ డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సదస్సుకు తహశీల్దార్ రాజరాజేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు విద్యార్థులు భాగస్వాములు కావాలని, వారి సలహాలు, సూచనలను 11 అంశాలపై 'అప్' ద్వారా తెలియజేయొచ్చని తెలిపారు. స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ రాష్ట్ర భవిష్యత్తు కోసం సాధించాల్సిన దాని గురించి రూపొందించబడిన ప్రతిష్టాత్మకమైన దార్శనిక పత్రం, ఇది సాకారం కావాలంటే ఇందులో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, రెవెనూ ఇన్స్పెక్టర్ కె.యశోద పాల్గొన్నారు

పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు ఆధ్వర్యంలో సంధ్య మెరైన్స్ ఎండి కె.ఆనంద్ కుమార్ లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతపర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఆగర్రు యుపి స్కూళ్లకు కుర్చీలు, బెంచీలు, ఫర్నీచర్ సుమారు రూ.6 లక్షలతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఆనంద్కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో పదో తరగతి మెరిట్ విద్యార్థులు పది మందికి స్కాలర్షిప్లు ఇస్తానని తెలిపారు. ఆనంద్కుమార్ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ ఎర్రింకి రామకృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమావేశాన్ని అడ్డుకోవడం అన్యాయం

కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకోవడాన్ని ఎపి కౌలు రైతుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ప్రజల పట్ల వైఖరి మారడం లేదని తెలిపారు. ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అంబేద్కర్ను అవమానించి, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టిన ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, పోలీసు అధికారులు శాంతియుతంగా జరుపుతున్న సమావేశాన్ని అడ్డుకుని కెవిపిఎస్, దళిత నాయకుల్ని నిర్బంధించడం అన్యాయమని తెలిపారు. సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి సామరస్యంగా పరిష్కరించకుండా సమస్యకు మూలమైన వారిని వదిలేసి రాజ్యాంగ నిర్మాతను అవమానించడం సరికాదని తెలిపారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని, శాంతియుతంగా మాట్లాడుతున్న వారిని అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమని పేర్కొన్నారు. తక్షణం అంబేద్కర్ ఫెక్సీ వివాదంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రజల మధ్య సామరస్యాన్ని కాపాడాలని కోరారు.

నేటి నుంచి సిద్ధాంతంలో స్టడీ క్యాంపు

పెనుగొండ:భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా స్థాయి అధ్యయన శిబిరం ఈనెల 2, 3, 4 తేదీల్లో సిద్ధాంతంలోని ఆరికె కళ్యాణ మండపంలో జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోపాలన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అధ్యయన శిబిరంలో రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, అరుణ్, జిల్లా కార్యదర్శి బి.బలరాం పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, సిద్ధాంతం కార్యదర్శి కె.రత్నరాజు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి మండలాధ్యక్షులు రవికుమార్ పుట్టినరోజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి మండల అధ్యక్షులు పరిమిశెట్టి రవికుమార్కు నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రవికుమార్ను అభినందించారు. మండలంలో పార్టీని మరింత ముందు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, టిడిపి పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీ తత్వాన్ని భావితరాలకు అందించాలి

భీమవరం టౌన్:గాంధీ తత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించే విధంగా నేటి తరం విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్ర గాంధీ స్మారక నిధి ఛైర్మన్ సీనియర్ ఐపిఎస్ ఆఫీసర్ గాంధీ పిసి ఖాజా పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గాంధీ 156వ జయంత్యుత్సవాల సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాంధీ పిసి ఖాజా మాట్లాడుతూ గాంధీజీ తన జీవితమంతా స్వచ్ఛత సేవ కే అంకితం చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, రిటైర్డ్ డిఇఒ ఇందుకూరు ప్రసాద్ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ నరసింహరాజు, డిఎన్ఆర్ పీజీ కోర్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం:స్థానిక వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జయంతోత్సవాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ గాంధేయవాది, కవి, రచయిత వాడ్రేవు సుందరరావు విచ్చేసి మాట్లాడారు. గాంధీజీ వివరించిన విలువలు, సిద్ధాంతాలు ఎప్పటికీ చిరస్మరణీయమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ గాంధీ మార్గాన్ని అనుసరించాలన్నారు. కళాశాల ట్రెజరర్ పోలిశెట్టి రఘురామారావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, పిజి అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.పార్థసారధి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పడిపోయినది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం పాత పట్టిసీమ గ్రామానికి చెందిన శ్రీ వీర భద్ర బోట్స్మెన్ అండ్ సాన్డ్ క్వారీ వర్కర్స్ రిజిస్టర్ నెం.**534** గల ఒరిజినల్ సర్టిఫికెట్ పట్టిసం నుండి రామయ్యపేట బైక్ మీద వెళ్ళుచుండగా పోయింది. దయచేసి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్ కి తెలియజేయగలరు.

ఈ. వెంకట గణేష్
పాత పట్టిసీమ
సెల్: 95056 34845

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ గ్రామానికి చెందిన శ్రీరాముల లీలా నాగదుర్గా వెంకటేశ్వరరావు, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పోయింది. ఒక అద్దె ఇల్లు నుండి వేరొక అద్దె ఇల్లుకు మారినప్పుడు నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ నెం.**G3619797** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

శ్రీరాముల లీలా నాగదుర్గ వెంకటేశ్వరరావు
తండ్రి: వెంకటేశ్వరరావు
పెనుగొండ మండలం
పెనుగొండ, ప॥గో॥జిల్లా
సెల్: 81437 32742

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd Additional సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టులో

E.P. No. 24/2022 in
O.S. No. 312/2021

Decree Holder : Annamreddi Subbarao
Judgment Debtor : Boddu Nethiyya

పై నెంబరు డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తివేలం నిమిత్తం ది. 18-10-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున కావలసినవారు ది. 18-10-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టుకు వచ్చి పాట షరతులు తెలుసుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub Registrar, Tadepalligudem Mandalam, Pullayigudem Grama Panchayati, area, H\o Appraopeta, Pullayigudem village, R.S.No. 511 Near by Door No. 2-63 to an extent of 145 sq. yards of site and RCC foof building therein within the following boundaries.
East : Pedamurthi Venkateswararao building
South : Dirsipo Polayya Building
West : Main road
North : Panchayati cement road
Within the above boundaries an extent of. 145 sq. yards of site and RCC roof building with all easement rights.

D.Hr. Value Rs. 4,00,000/-
Amin Value Rs.10,00,000/-

There are no encumbrance on the schedule property as per E.C.

Kusuluri Siva Rama Krishna
Advocate for D.Hr.
Tadepalligudem
Tadepalligudem.
Date: 20-09-2024
Ph: 99490 76266

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెదవేగి, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, భీమవరం అర్బన్, ఇరగవరం, పెంటపాడు, పోడూరు, ఏలూరు కల్చరల్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
నూజివీడు, విజయరాయి, కైకలూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం
ఇంటర్వ్యూ : తేది: 02-10-2024 బుధవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బలుసువారి వీధి, పవర్పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

వృద్ధులను గౌరవించాలి

ప్రజాశక్తి - తణుకు

వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు, చట్టాలు కట్టుబడి ఉన్నాయని, ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని ప్యానెల్ న్యాయవాదులు అన్నారు. మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సంధ్యాజ్యోతి వృద్ధ జనాశ్రయంలో ఛైర్మన్, జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాదులు మాట్లాడుతూ వృద్ధుల కోసం 2007లో సీనియర్ సిటిజన్స్ చట్ట ప్రకారం పిల్లల నుంచి నిరాదరణకు గురైన తల్లిదండ్రులు వారి నుండి భరణం పొందే అవకాశం ఉందన్నారు. పిల్లలకు రాసిన ఆస్తులు తిరిగి తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వృద్ధ జనాశ్రయ ఫౌండర్, సెక్రటరీ, న్యాయవాది డి.రాధమ్మ, ప్యానెల్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ఎవి.సత్యనారాయణ, కిరణ్మయి, అజయ్కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:సీనియర్ సిటీజన్లకు గౌరవం ఇవ్వాలని, వారి విలువైన సూచనలు మనం తప్పక పాటించాలని లయన్స్ జిల్లా కో ఆర్డినేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తెలిపారు. స్థానిక డైమండ్స్ కార్యాలయంలో క్లబ్ ఉపాధ్యక్షులు లంకా శ్రీనివాస్ అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయస్థాన ఉద్యోగి లయన్ యర్రా ఆంజనేయస్వామిని సత్కరించి లయన్స్ జ్ఞాపికను అందజేశారు. వృద్ధులను సీనియర్ సిటిజన్స్ను అన్ని వర్గాల వారూ గౌరవించాన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మునగాల జితేంద్ర కుమార్, లయన్ నార్ని వెంకట కృష్ణారావు, దంత వైద్యులు లయన్ డాక్టర్ భాను సత్యనారాయణ, లయన్ ఆకుల సతీష్నాయుడు పాల్గొన్నారు.

ఆకివీడు : తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో ఉంచడం సమంజసం కాదని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ మండల వృద్ధుల సంక్షేమ సంఘం లయన్స్ క్లబ్, ఆదర్శ లయన్స్ క్లబ్ అభయ లయన్స్, గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లయన్ హాల్లో వృద్ధుల చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఎంవి.సూర్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. తహశీల్దార్ మాట్లాడారు. వృద్ధులు ఎవరైనా నిరాదరణకు గురైతే వెంటనే తమను సంప్రదించాలని, వారికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. డాక్టర్ ఎంఎస్.రాజు, వృద్ధుల సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, లయన్స్ ప్రముఖులు మాట్లాడారు అనంతరం వృద్ధులు కవి చిర్రావూరి సూర్యనారాయణమూర్తి, మరో అభ్యుదయకవి చంద్రశేఖర్, సామాజిక సేవకుడు గాంట్ల సత్యనారాయణను సత్కరించారు. అలాగే సుమారు 200 మంది వృద్ధులకు డాక్టర్ కవిత, డాక్టర్ నవీన్ సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు.

ఉండి : సమాజంలో వృద్ధుల శాతం పెరుగుతోందని, వీళ్లను ఆదరించాలని ఉండి మానవత సేవా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. మంగళవారం ఉప్పులూరు గ్రామంలో మానవత సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షులు పెన్మెత్స రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. రంగరాజు మాట్లాడారు. అనంతరం ఇద్దరు వృద్ధులు గంగు రాములు, ఉమ్మిడి వనజాక్షిని సత్కరించారు. కార్యక్రమంలో మండల కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులు యర్రా విక్రమ్, గంధం ఏడుకొండలు, ఓదూరి రాంబాబు, యర్రా చిట్టిబాబు, లోకం సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం : అంతర్జాతీయ వృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీచుపాలెం రోడ్లోని బొండమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నామినేటెడ్ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, యర్రంశెట్టి ఫణికర్, ఆనందబాబు, ఆశ్రమం నిర్వాహకులు షేక్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.